ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 01.09.2024 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. భారీ వర్షాల వల్ల రాష్ట్రంలో వివిధ ఘటనల్లో 9 మంది మరణించినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పారు.

2. భారీ వర్షాలతో వచ్చిన నీటిని వృధా చేయకుండా భవిష్యత్ అవసరాలకు నిల్వ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు.

3. వర్షాల కారణంగా హైదరాబాద్ – విజయవాడ మధ్య వాహనాల రాకపోకలను నిలిపివేశారు. మరోవైపు దక్షిణ మధ్య రైల్వే 19 రైళ్లను రద్దు చేసింది.

4. ఎడతెరిపి లేని వర్షాల నేపధ్యంలో తెలంగాణ ప్రభుత్వం రేపు ప్రభుత్వ , ప్రైవేట్ విద్యా సంస్థలకు సెలవు ప్రకటించింది.

**LEAD RAINS:**

దక్షిణ బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు తెలంగాణలో నిన్నటి నుంచి సాధారణ జనజీవితం స్తంభించిపోయింది. గత రాత్రి కళింగపట్నం వద్ద వాయుగుండం తీరం దాటినప్పటికి మరో 24 గంటలు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ సహా వివిధ పట్టణాలు, గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు, రోడ్లు, ఇళ్లు, వ్యవసాయ క్షేత్రాల్లో వరద నీరు చేరడంతో ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు.

**DESK**

**IRRIGATION:**

భారీ వర్షాల కారణంగా వస్తున్న వరద నీటిని వృధా చేయకుండా భవిష్యత్ అవసరాల కోసం నిల్వ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆ శాఖ అధికారులను ఆదేశించారు. వరద నీటిని రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో నిల్వ చేయాలని సూచించారు.

SDP

**RAINS CM:**

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమీక్ష నిర్వహించారు. అధికారులు సెలవులు పెట్టొద్దని, సెలవులు పెట్టిన వారు వెంటనే రద్దు చేసుకొని వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు. అత్యవసర విభాగాల అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపాలని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అత్యంత అప్రమత్తతతో ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు. ఇలాంటి విపత్కర సమయాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సేవలందించాలని ముఖ్యమంత్రి కోరారు.

**PTC**

**PONGULETI:**

రేపటి వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని , ఆస్తి ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. సచివాలయం నుంచి సహాయ రక్షణ పునరావాస చర్యల గురించి జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రెవెన్యూ మంత్రి , ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. భారీ వర్షాల వల్ల రాష్ట్రంలో వివిధ ఘటనల్లో 9 మంది మరణించారని రెవెన్యూ మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ... అన్ని చెరువులు కాలువలను జిల్లాలో ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలనీ

కట్టలు తెగి ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఇంత  వరకు 85 చెరువులు, కాలువలు దెబ్బతిన్నట్లు తెలుస్తోందని ఆమె చెప్పారు. జాతీయ విపత్తు నిర్వహణ దళం, రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం బృందాలతో పాటు హైదరాబాద్ నుంచి వరద ప్రాంతాల్లో అవసరమైన సహాయం అందిస్తున్నామని, ఈ నిమిత్తం రాష్ట సచివాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఆమె చెప్పారు. ఇంత  వరకు రాష్ట్రంలో 45 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 2,500 మందిని ఈ శిబిరాలకు తరలించారు.

PTC, HYD

**RAINS HYD:**

హైదరాబాద్లో నిన్న , ఈరోజు కురిసిన భారీ వర్షాల కారణంగా రోడ్లపై నీరు నిలిచి రోడ్లు చెరువులుగా మారిపోయాయి. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురై సాధారణ జనజీవనం అస్తవ్యస్తమైం ది. కొన్నిచోట్ల చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకి అంతరాయం కలిగింది. గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి జిహెచ్ఎంసి అధికారులతో కలిసి హుస్సేన్ సాగర్ నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. నగరంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**PTC**

**KHAMMAM:**

విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ఖమ్మం  లోని మున్నేరు  వాగు పొం గి ప్రవహిస్తోంది. మునుపెన్నడు లేని విధంగా లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి.  ఖమ్మంలోని మామిళ్ళగూడెం, ప్రకాష్ నగర్, గాంధీ చౌక్, కవిరాజు నగర్, తదితర ప్రాంతాల్లో రెండంతస్తుల భవనాలను తాకుతూ మున్నేరు ప్రవహిస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా  ఏర్పడిన విద్యుత్ సమస్యలపై మధిర నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమీక్షించారు. వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం కలిగిన చోట పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

**PTC, KMM**

**TRAINS:**

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపధ్యంలో దక్షిణ మధ్య రైల్వే గోదావరి ఎక్స్ ప్రెస్ తో సహా 19 రైళ్లను రద్దు చేసింది. ట్రాక్ లపై వరద నీరు నిలిచి ఉండడంతో మరో 15 రైళ్లను దారి మళ్లించింది. లింగంపల్లి-కాకినాడ పోర్ట్, సికింద్రాబాద్ – విశాఖపట్నం, సికింద్రాబాద్ – మణుగూరు, సికింద్రాబాద్ – బెనారస్, నర్సాపూర్ – హైదరాబాద్ వెళ్లే రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. మరికొన్ని రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.

PN

**TRAFFIC:**

హైదరాబాద్ – విజయవాడ రహదారిపై సూర్యాపేట వద్ద వరద నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెరువులు, కుంటల నుంచి వరద నీరు పొంగిపొర్లడంతో జాతీయ రహదారి నంబర్ 65 పై వరద నీరు చేరి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపధ్యంలో హైదరాబాద్ నుండి విజయవాడ వెళ్లే వాహనాలను వయా నార్కట్ పల్లి, అద్దంకి, ఖమ్మం మీదుగా దారి మళ్లిస్తున్నారు. ఇలా ఉండగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఉప్పల్ నుండి మేడ్చల్ కు వెళ్లే రహదారిపై వర్షం నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

**DESK**

**HOLIDAY:**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపధ్యంలో రేపు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు తెలంగాణ ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అదే విధంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల సెలవులను రద్దు చేసింది. అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**DESK**

**COLLECTOR:**

హైదరాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఆస్తి , ప్రాణనష్టం సంభవించకుండా లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎప్పడికప్పుడు అప్రమత్తం చేయాలనీ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. జియగూడ మండి పక్కన మూసి వరద నీటి ప్రవాహ వేగాన్ని కలెక్టర్ పరిశీలించి లోతట్టు ప్రాంత ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ... భారీ వర్షాల నేపథ్యంలో ఉస్మాన్ సాగర్ , హిమాయత్ సాగర్ లలో వరద నీరు చేరడం వలన గేట్లు ఎత్తి మూసి లోకి వదలడం జరుగుతుందన్నారు. అందుకే లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి రెండు గంటల ముందు సహాయ శిభిరాలకు తరలించాలన్నారు.

**PTC, HYD**

**MANAIR:**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల వద్ద గల ఎగువ మానేరు ప్రాజెక్టు కు పాల్వంచ వాగు, లొట్టి వాగు వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నది. ఎగువ మానేరు పూర్తిస్థాయి నీటి మట్టం 31 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 25 అడుగలకు చేరిందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

PTC

**SREESAILAM:**

భారీ వర్షాల కారణంగా హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై అనేక చోట్ల కొండ చరియలు విరిగిపడ్డాయి. అమ్రాబాద్ మండలంలోని ఈగలపెంట - పాతాళ గంగ మధ్య కొండ చరియలు విరిగిపడ్డాయి. ప్రజలు హైదరాబాద్ నుంచి శ్రీశైలంకి ప్రస్తుతం ప్రయాణం జరపరాదని నాగర్ కర్నూల్ ఎస్పీ గైక్వాండ్ సూచించారు . తెలంగాణ పోలీసులు , నాగర్ కర్నూల్ జిల్లాలోని వెల్దండ మండలంలో కోట్ర తండా వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి హైదరాబాద్ నుంచి వస్తున్న ప్రయాణికులను ఆపి వెనక్కి పంపుతున్నారు.

**DESK**

**HYDRA RAINS:**

హైదరాబాద్ లో కురుస్తున్న భారీ వర్షాల నేపధ్యంలో హైడ్రా కమీషనర్ రంగనాథ్ లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. షేక్ పేట్, టోలిచౌకి, బేగంపేట్, జిహెచ్ఎంసీ పరిధిలోని ఇతర లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. రహదారుల మీద నీరు నిల్వకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తర్వాత పలు చెరువులు, నాలాలను పరిశీలించారు.

**PTC, HYD**

**DGP:**

మహబూబాబాద్ జిల్లా, కేసముద్రం వద్ద రైల్వే ట్రాక్ దెబ్బతిన్న కారణంగా నిలిచిపోయిన రైలు ప్రయాణికులకు జిల్లా పోలీసులు అందించిన సహకారంపై డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జితేందర్ ప్రశంసించారు. వరద నీరు కారణంగా మహబూబాబాద్ లో రైల్వే ట్రాక్ లు దెబ్బతినడంతో రైళ్లు నిలిచిపోయాయి. ఇది తెలుసుకున్న మహబూబాబాద్ రూరల్ సిఐ శరణ్య, ఎస్సై మురళిధర్ సహా పోలీసులు.... పెద్దలు, చిన్న పిల్లల కోసం ఆహారం, మంచినీరు, బిస్కట్ ప్యాకెట్లను అందించారు. మహబూబాబాద్ లో నిలిచి పోయిన రైల్వే ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేర్చడానికి చర్యలు తీసుకుంటున్నట్లు డిజిపి తెలిపారు.

**DESK**

**SCHME:**

దేశంలో ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీకి ఒక సుస్థిరమైన , సానుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రారంభిస్తుందని ఎలక్ట్రానిక్స్ ఐటి మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. న్యూఢిల్లీలో ఎకనామిక్స్ టైమ్స్ ప్రపంచ నాయకుల ఫోరం ఉద్దేశించి ప్రసంగస్తూ... మన దేశంలో వినియోగిస్తున్న మొబైల్ ఫోన్లలో 99% దేశీయంగానే ఉత్పత్తి అవుతున్నాయని చెప్పారు.

**NSD**

**HOLIDAY**: The Telangana government has declared a holiday for all government and private educational institutions tomorrow in the wake of incessant rains. It has also issued orders cancelling holidays for all government departments. It has made it clear that the authorities should remain vigilant and be available to the public. (DESK)